# పంజరం

(1989)

"చంద్రా! ఓ చంద్రా!"

తల్లి పిలుపు వినపడేసరికి మావిడి చెట్టుకొమ్మమీద కూర్చుని ఏటిమీద తిరుగాడే పడవనీ, నీళ్ళమీద మిలమిల మెరిసే సూర్యకాంతినీ చూస్తూ, వేపపుల్లతో పళ్ళు తోముకుంటున్న అపూర్వ చంద్ర కొమ్మ మీంచి కిందికి దూకాడు.

"మాస్టారు వచ్చే వేళవుతోంది. పాలు తాగి, స్నానం చేసి తెమలరాదూ!" అంది వైదేహి కొడుకు దగ్గరకొచ్చి

అపూర్వ చంద్ర ఏటి ఒడ్డుకు తుర్రుమన్నాడు. క్షణంలో ముఖం కడుక్కుని, గోరువెచ్చని నీటిలో రెండు మునుగులు మునిగి చక్కా వచ్చాడు.

"అబ్బెబ్బె! అలాగేనా? ఒళ్ళెక్కడ రుద్దుకున్నావ్? ఆ కాళ్ళకు ఇసుక చూడు. ఎలా పట్టేసిందో?" అంటూ కొడుకును నూతి దగ్గరకు తీసుకువెళ్ళి నీళ్ళు తోడి పోసి, శాండల్ వుడ్ సబ్బుతోరుద్ది, పొడి తువ్వాలుతో తుడిచింది.

ఇంతలో సిమ్మన్న వచ్చాడు. ఎర్రావుని శుభ్రం చేసి దాని దూడకు బంధవిముక్తి చేశాడు, లేగదూడ తల్లి దగ్గరకు వెళ్ళకుండా చంద్ర దగ్గరకు వచ్చింది.

"నీకూ ఆటలు వీడితోనేనా? పోయి పాలు తాగు" అంది వైదేహి.

చంద్ర లోపలకు వెళ్ళి తెల్లచొక్కా, ఆకుపచ్చ లాగూ వేసుకొచ్చాడు. బంగారు రంగులో మెరిసిపోయే కంచుగ్లాసుతో సిమ్మన్న గుమ్మపాలు అందిస్తే తాగేసి, లేగదూడతో కాస్సేపు ఆడాడు. ఆ తర్వాత పెంపుడు బాతుని, చిలకల్ని, పావురాల్ని, కుందేళ్ళనీ పలక

రించి వాటికి ఆహారాన్ని పెట్టి, పారిజాతం చెట్టు మొదట్లో ఉన్న గట్టుమీద కూర్చొని ఒడ్డుకు వస్తున్న పడవ వంక చూశాడు.

ఎవరో దిగేరు!

మాస్టారు మాత్రం రాలేదు.

"ఇంకా ఎండ ఎర్రబడలేదు. మాస్టారు రావడానికి టైముంది" అనుకున్నాడు అపూర్వచంద్ర.

ఎనిమిదేళ్ళ వయసున్న అపూర్వ చంద్రకు స్కూలు చదువు లేదు. ఆచార్యుల వారి దగ్గర తెలుగు, సంస్కృతం, పట్నం మాస్టారి దగ్గర ఇంగ్లీషూ, గణితమూ. వారంలో మూడు రోజులవీ.మూడురోజులివీ, హిందూదేశ చరిత్ర, సంస్కృతి, మహామహుల కథలూ రాత్రులు వైదేహి చెబుతోంది.

"రేయ్ చంద్రా-పట్నంలో సర్కస్ ఆడుతోంది. తెల్సా? నేను నిన్ననే వెళ్ళా మా నాన్నతో" అంటూ వచ్చాడు గోపీ.

అపూర్వ చంద్ర కళ్ళు మెరిశాయి.

"బాగుందా సర్కస్సు?" అడిగాడు.

"ఓ! పులులూ, సింహాలూ, గుర్రాలూ, ఏనుగులూ అన్నీ ఉన్నాయి. నిజంగా ఎంత బాగుందో!" ఊరించాడు గోపీ. మోటార్ సైకిల్ ఫీట్స్ గురించీ, బఫూన్ల గురించీ ఇంకా చాలా వాటి గురించి చెప్పాడు. "నువ్వూ వెళ్ళరాదూ?" అన్నాడు చివరికి.

"అవును వెళ్ళాలి." అనుకున్నాడు చంద్ర, గోపీ వెళ్ళాక.

అయితే ఎవరితో వెళ్ళాలి? అమ్మ ఎక్కడికీ రాదు. గోపీలా నాన్నతో వెళ్ళాలంటే....తనకు నాన్న ఉన్నారా?

"అందరికీ ఉన్నారు నాకేరమ్మా నాన్నగారు?" అడిగాడోమారు తల్లిని-తల్లి సమాధానం చెప్పలేదు. ఆ తర్వాత కూడా చాలామార్లు అడిగి ఊరుకున్నాడు. విషయాన్ని దాటవేసిందేగాని సమాధానం

చెప్పలే దావిడ. మరోమారు నిలదీస్తే కళ్ళనీళ్ళు పెట్టుకుంది. తండ్రిని గురించి అడిగితే తల్లి బాధపడుతుందని మాత్రం తెలిసింది, అంతే! తర్వాత ఆ విషయం గురించి తల్లిని అడగకూడ దను కున్నాడు.

మరి సర్కస్‌కి ఎవరితో వెళ్ళడం? తల్లి తనతోరాదు. రోజంతా ఇంట్లోనూ, పూల తోట మధ్యా గడిపేస్తుంది. పువ్వులు కోయడం, మాలలు కట్టడం, పాదులకు కాసిన కాయల్ని కోయడం....ఇదే పని ఆమెకు.

"ఎలాగైనా వెళ్ళాలి! సర్కస్‌కు వెళ్ళాలి" అనుకున్నాడు చంద్ర.

తర్వాత పడవలో పట్నం మాష్టారు వచ్చారు. ఇంగ్లీషు పాఠం, వ్యాకరణం, స్పెల్లింగులూ చెప్పారు. క్రితంరోజు ఇచ్చిన స్పెల్లింగులు కంఠతా వచ్చాయో, లేదో అప్పజెప్పించుకున్నారు.

మధ్యాహ్నమైంది. మాస్టారుగారికి వసారాలోనూ, చంద్రకు గదిలోనూ భోజనం పెట్టింది. వైదేహి, పప్పు, ఆవునెయ్యి, గోంగూర పచ్చడి, ఇంగువచారు, పెరుగు,

భోంచేశాక మాస్టారుగారు కాస్సేపు ఆ చెట్టుకిందా, ఈ చెట్టు కిందా తచ్చట్లాడి, భుక్తాయాసం తీరాక కాస్సేపు లెక్కలు చెప్పి వెళ్ళి పోయారు.

ఉదయం కోసిన పూలన్నీ ముందేసుకుని మాలలు కట్టే ప్రయత్నంలో దారం తీసింది వైదేహి.

"అమ్మా! నేను సర్కస్‌కి వెళ్తానే" మనసులోని మాటను బయటపెట్టాడు అపూర్వచంద్ర. తల్లి ఏం అనకపోయేసరికి గోపీ చెప్పిన వివరాలు చెప్పి మళ్ళీ అడిగాడు.

"వెళ్దూగాన్లే" అంది వైదేహి.

"ఎవరితో వెళ్ళనూ? గోపీయేమో వాళ్ళ నాన్నతో వెళ్ళాడట!" అని ఊరుకున్నాడు. వైదేహి వెంటనే ఏమీ అనలేదు. కాస్సేపాగి అంది.

"జగన్నాథం మామయ్యకు కబురంపుతానులే. రేపు నువ్వూ మామయ్యా వెళ్లొచ్చు."

అపూర్వ చంద్ర కాస్త నిరాశపడినా, తర్వాత తనకు తానే సరిపెట్టుకుని ఆనందించాడు.

ఎలాగైతేనేం? తను సర్కస్ చూడాలి అంతే!

ఆ సాయంకాలం గోపీ వాళ్లొస్తె కోతికొమ్మచ్చి ఆట ఆడేడు. కాస్సేపు ఏటిలో ఈదేడు. పిల్లలతో కేరింతలు కొట్టేడు. బాతులకి స్నానాలు చేయించాడు. చిలకలకు కాస్సేపు ఏబీసీడీలు నేర్పించాడు.

సాయంకాలం చంద్రబింబం కాంతిగా ఏటినీట్లో మెరిసే వేళకి పుస్తకాలు తీసుకుని దీపం ముందు కూర్చున్నాడు; మాస్టారు చెప్పిన పాఠాలన్నీ నోటికి కంఠతా వచ్చేట్టు చదివేడు.

'చదువుకోడం బావుంటుంది' అనుకున్నాడు. అ మాటకొస్తె ఆడుకోడమూ బావుంటుంది.ఏట్లో ఈత కొట్టడమూ. వర్షాకాలపు వానల్లో తడవడమూ-అన్నీ బావుంటాయి.

బావుండని దొక్కటే! తనకీ అందరిలా నాన్నగారూ,చెల్లాయీ, తమ్ముడూ, అక్క, అన్నయ్యా లేకపోవడం.

వెన్నెట్లో ఏరు నల్లచీరకున్న జలతారంచులా మెరుస్తోంది.

జగన్నాథం మావయ్య వచ్చేడు. వైదేహి ఏదో మాట్లాడిం దతనితో. సర్కస్ చూడాలని చంద్ర ఉబలాటపడుతున్నట్లు చెప్పింది ఆ మర్నాడు తీసుకెళ్ళడానికి ఒప్పుకున్నాడు మావయ్య. చంద్ర ఎగిరి గంతేశాడు.

ఆరు బయట చందమామ వెలుగులో చంద్రకి అన్నం పెట్టింది వైదేహి. వెన్నెల రాత్రులు ఆరుబయటే అన్నం తినడం చంద్రకు ఇష్టం.

కొరివికారం, వెన్నముద్ద, పప్పుపులుసు, పెరుగు - అన్నం తింటూ మధ్యమధ్య నక్షత్రాల్ని లెక్కపెడుతున్నాడు.

మావయ్య తల్లితో ఏవేవో అంటున్నాడు.

"ఇలా ఒంటరిగా మగతోడు లేకుండా ఎన్నాళ్ళుంటావమ్మా; ఇంకెంత కొంప! మాకు మాత్రం ఎవరున్నారు గనుక? నువ్వెక్కడ ఉన్నా ఎవరు కాదంటారు?"

"ఇప్పుడే శాంతిగా ఉందన్నయ్యా-నాన్నగారు అప్పట్లో కొన్న ఈ కాసింత జాగా నా గురించే కొన్నట్లనిపిస్తోంది. ఆయన పోయినా ఈ నేల ప్రతి అంగుళంలోనూ ఆయనే కనిపిస్తున్నారు నాకు. నాన్న గారికీ, నాకూ ఇష్టమైన ఈ పూలూ, ఈవెన్నెలా, ఈ ఏరూ-వీటన్నిటినీ మించి పుస్తకాలూ....నా అభిరుచి మేర చంద్రుణ్ణి పెంచుకుంటు న్నాను. ఇవి చాలు జీవితానికి?" అంటోంది తల్లి.

అపూర్వ చంద్రకి ఆ మాటలు కొన్ని అర్థమౌతాయి. కొన్ని అర్థం కావు. ఏమైనా అడిగితే "చిన్నవాడివి-నీ కెందు కివన్నీ? స్వచ్ఛంగా, స్వేచ్ఛగా పెరగాల్సిన వయస్సు నీది" అంటుంది. అందుకే మాట్లాడడు.

జగన్నాథం మావయ్య వెళ్ళిపోయాడు.

ఏటి నుంచి వచ్చే గాలి పూల పరిమళాన్ని మోసుకొస్తోంది.

"యెలురంతా మేసి
యేరు నెమరేసింది
కలవరపు నా బతుకు
కలత నిదరయ్యింది..."

నండూరి వారి గీతం మదిలో మెదిలింది.ఆ వెంటనే....

"ఎన్నెలంతా జగతిని
ఎల్లువలా ముంచింది
మల్లెలతో పిల్లగాలి
సరసమాడి వత్తోంది...."

కొత్త గీతమేదో వైదేహి మనసులో కొట్టుకులాడింది.

"అమ్మా! అమ్మా'- నిన్నటిలా మరో రాకుమారుడి కథ చెప్పవూ?" అడిగాడు అపూర్వచంద్ర,

అమ్మ చెప్పే కథలూ, కథల్లాంటి చరిత్ర పాఠాయి వింటేనే గాని చంద్రకి నిద్రపట్టదు. ఒకొక్కప్పుదు వింటూనే నిద్రపోతాడు.

వైదేహి ఆలోచించి చెప్పింది.

"ఈ మారు రాజకుమారుడి కథ కాదు. గానుగెద్దు కథ చెబుతాను. స్వేచ్ఛకోసం ఏ ప్రాణైనా ఎలా తపించిపోతుందో తెలుస్తుందా కథ వల్ల . చెప్పనా?"

ఆనందంగా తలూపాడు చంద్ర.

కథ ఇట్టే అయిపోయినట్టయింది. కథ పూర్తయ్యాక బరువుగా నిట్టూర్చాడు. కాసేపు ఆలోచించాడు. ఆ తర్వాత నెమ్మదిగా నిద్రపోయాడు.

తూర్పు తెల్లపడుతూండగానే చంద్రను లేపేసింది వైదేహి. కొండమీద కొచ్చే ఎర్రటి సూర్యబింబాన్ని ఏటి నీట్లో చూస్తూ త్వర త్వరగా తన పనులన్నీ కానిచ్చేడు అపూర్వచంద్ర. తల్లి చేసే పూజ కోసం పారిజాతం, నందివర్ధనం, మందారం, ఎర్రగన్నేరు పువ్వుల్ని సజ్జనిండా ఏరి, దేవుడి మందిరం పక్కగా పెట్టాడు. కాస్సేపు దేవుడి మందిరం ఎదుట కూర్చుని తనకొచ్చిన వినాయకస్తోత్రం, శివస్తోత్రం, సరస్వతీస్తోత్రం చదివాడు.

తర్వాత ఆచార్యుల గారింటికి వెళ్ళి ఆ పూట చదువుకునేందుకు రానని చెప్పి వచ్చాడు. భోజనం త్వరగా చేసేసి జగన్నాథం మావయ్యకోసం ఎదురు చూడసాగాడు.

మావయ్య వచ్చాడు. చెప్పాల్సిన జాగ్రత్తలన్నీ చెప్పింది వైదేహి. తెల్ల సిల్కు పైజామా వేసుకుని దొరబాబులా తయారయ్యాడు అపూర్వ చంద్ర. దేవుడి పటం ముందున్న విభూతిని తీసి చంద్ర నుదుట పెట్టింది వైదేహి– చాటుకి పిల్చి లాల్చీ జేబులో కొన్ని నోట్లు కుక్కి "నీ క్కావలసినవి కొనుక్కో!" అంది.

ఏటి ఒడ్డున పడవ రెడీగా ఉంది. ఎండ వేడిని చల్లగాలి వడగడుతూంది.... రేవులో జనం ఉన్నారు. సర్కస్ కెళ్ళే జనమే!

"ఏటండోయ్ అబ్బాయిగోరూ? ఈరోజు మా పడవెక్కేరు. చాన్నాళ్ళకి" అన్నాడు పడవ నడిపే మల్లయ్య.

"సర్కస్ కెళ్తున్నా" అన్నాడు చంద్ర కళ్ళెగరేస్తూ

"నానూ వచ్చేదా నీతో?" అడిగాడు మల్లయ్య నవ్వుతూ.

"మరి.... పడనో....?"

అంతా నవ్వేశారు. పడవ కదిలింది.

చుట్టూ నీళ్ళు. ముందుకు పోతూ పడవ. ఎదురొస్తూ చల్లగాలి! పడవలోంచి చూస్తే తమ ఇల్లు కనిపిస్తోంది– సినిమాలలో చూపే పర్ణశాలలా.... చుట్టూ రంగురంగుల పూలతో.... తోట! గుమ్మంలో తల్లి నిల్చొని తదేకంగా చూస్తోంది. "అమ్మకూడా వస్తే బాగుండును" అనుకున్నాడు అపూర్వచంద్ర!

పడవ నడుస్తోంది. నీటిలో చిన్న చిన్న కెరటాలు. చేప పిల్లలన్నీ ఒక్కసారి పైకెగిరి అలలతో ఆడుకుంటున్నాయి. ఎప్పటిదో.... జ్ఞాపకం.... ఒకమారు సిపాయి తాత నడిగి వలలో చిక్కిన ఓ చిన్న చేపపిల్లను ఇంటికి తీసుకెళ్ళాడు. అమ్మ కోప్పడింది. బిక్కచచ్చిన

చేప పిల్లను నీళ్ళగోలెంలో వదిలేస్తే. ఈదుకుంటూ గోలెమంతా తిరిగింది. చేప నీట్లోనేగాని బయట బతకదని తెలిసిందప్పుడే!

పడవ ఒడ్డు చేరింది.

గుర్రబ్బండీ మాట్లాడాడు మావయ్య. తాటి తోపు పక్కగా దగ్గర దారిలో రెండు ఫర్లాంగులు. కథలో అమ్మ చెప్పిన రాజకుమారుడి గుర్రంలా అందంగా, బలంగా లేదా గుర్రం. తిండి లేనట్లు బక్కచిక్కి ఉంది. దాని ప్రాణానికో బండి. బండిలో మనుషులూ! గుర్రం గురించి ఆలోచించడం మానేస్తే ప్రయాణం బాగానే ఉంది.

సర్కస్ డేరా ముందు జనం బాగానే ఉన్నారు. చిన్నా, పెద్దా, ఆడా–మగా. రంగురంగుల బట్టలు, రంగులరాట్నాలు. ఏవేవో దుకాణాలు, తినుబండారాల బళ్ళు, ఐస్‌క్రీం బళ్ళు.... కోలాహలంగా ఉందా ప్రదేశం.

టిక్కెట్లు తీశాడు మావయ్య. మరో కాస్సేపట్లోనే ఆట మొదలైంది.

ఒంట్లో ఎముకలు లేనట్లు చేసే ఆడవాళ్ళ విన్యాసాలు, బఫూన్ వాళ్ళ వింత ప్రవర్తన, సర్కస్‌లో తప్ప మరెక్కడా చూడని, నిజమేనా అనిపించే ఎన్నెన్నో గారడీల్లాంటి ఆటలు.

చివరగా పెద్దపెద్ద బోనుల్లో ఉన్న సింహాల్నీ. పులుల్నీ తీసుకొచ్చారు. కొరడా ఝుళిపించి వాటిచేత చెప్పినట్టు చేయించారు. ఆడించారు. సింహం ఏనుగు పైకెక్కి ఠీవీగా కూర్చుంది. పెద్దపులి వీటితో కలిసి ఆడింది. సహజంగా బద్ధ శత్రువులైన జంతువులు వాటి వాటి లక్షణాలనీ, చేష్టల్నీ వదిలిపెట్టి మనుషుల చెప్పుచేతల్లో ఆడమన్నట్లు ఆడాయి. మళ్ళీ బోనుల్లోకి వెళ్ళిపోయాయి.

క్రితం రాత్రి తల్లి చెప్పిన గానుగెద్దు కథ గుర్తుకొచ్చింది.

అపూర్వ చంద్రకి- గానుగెద్దుకీ, సర్కస్ కంపెనీల్లోని క్రూర జంతువులకీ గల తేడా ఆలోచించసాగాడు.

సర్కస్ ప్రదర్శన అయిపోయింది.

బయటి కొచ్చాక "ఈసారి గుర్రబ్బండీ వద్దు" అన్నాడు చంద్ర.

"సరే! బజారంతా నడిచి చూద్దాం.... తర్వాత రిక్షా ఎక్కుదాం, ఏం?" అన్నాడు మావయ్య.

బజార్లో ఏవో ఆట వస్తువులు కొన్నాడు మావయ్య. మావయ్యకి పిల్లల్లేరు. అందుకే తనంటే ముద్దు. అమ్మనీ, తననీ వచ్చి వాళ్ళతో బాటే ఉండమంటాడు. అమ్మ రానంటుంది.

"నీకు క్రికెట్ బ్యాటూ, బంతీ కొననా?" అడిగేడు మావయ్య.

"అమ్మ కొనమందా?"

"అమ్మకాదు. నేనే కొంటాను" అన్నాడు మావయ్య నవ్వుతూ.

గోపీకీ. వాసుకూ బిళ్ళాకర్రా అయితే వచ్చు. ఈ క్రికెట్ ఆట ఆడతారో ఆడరో! ఎలా ఆడాలో అమ్మ ఒకసారి చెప్పింది.

నడుస్తున్న వాడల్లా ఒక్కమారు ఆగిపోయాడు అపూర్వచంద్ర. అక్కడి దృశ్యం అతన్ని ఆకర్షించి నిలిపేసింది.

ఎన్నెన్నో పంజరాలు.... ఓ పాతిక వరకూ ఉంటాయి. అందులో రకరకాలైన పిట్టలు. రంగురంగుల పిట్టలు! చిలకలు, మైనాలూ, గోరింకలూ, పావురాలూ! ముక్కులూ, తోకలు రంగులూ వేరువేరుగా ఉండే పేర్లు తెలియని ఎన్నెన్నో పిట్టలు!

ఆ పిట్టల్ని పంజరాలతోపాటు అమ్ముతున్నాడొకడు.

ఇన్ని పిట్టల్ని ఎక్కడ పట్టేడో! ఆశ్చర్యమనిపించింది చంద్రకి.

"వీటి నెంతకిస్తావ్?" అడిగాడు.

"పిట్టల్ని బట్టి రేట్లుంటాయి. పంజరాల ధర అదనం" అంటూ ఏదేది ఎంతెంతో చెప్పాడు వాడు.

అపూర్వచంద్ర బుర్రలో ఏదో వింత కోరిక పుట్టింది. "పిటిల్లో కొన్నయినా కొంటాను మావయ్యా" అన్నాడు మావయ్యతో.

"ఇవెందుకూ? మీ దగ్గర చిలకలూ, బాతులూ, పావురాలూ ఉన్నాయిగా. అమ్మ కోప్పడుతుందేమో!" అన్నాడు మావయ్య.

"ఏం అనదులే. నే చెప్తాగా!" అంటూ జేబులో అమ్మ పెట్టిన నోట్లు బయటకు తీశాడు. లెక్కపెట్టి వాటికి ఎన్ని పిట్టలొస్తాయో చూశాడు. తనకి నచ్చిన పిట్టల్ని ఎంచాడు. "పంజరం ఒకటి చాలు" అన్నాడు.

"అలా అయితే బతకవు బాబూ" అన్నాడు వాడు.

"నాకలాగే ఇవ్వు" అన్నాడు అపూర్వ చంద్ర. మావయ్య ఏం మాట్లాడకుండా చూస్తున్నాడు. "పోనీ.... క్రికెట్ బేటూ, బంతీ వద్దులే మావయ్యా" అన్నాడు చంద్ర అక్కడి నుంచి కదిలాక. మావయ్య వినిపించుకోలేదు. వాటినీ కొన్నాడు.

ఈమారు రిక్షా ఎక్కారు. రిక్షా మెల్లగా పోతోంది. రిక్షా తొక్కే వాడి ఒంటినిండా చెమట- కాళ్ళలో నరాలు తేలాయి.

ఆలోచనలు.... ఆలోచనలు

మళ్ళీ కథల్లో మనుషులతో పోలిక....

అపూర్వ చంద్ర పంజరం వంక చూశాడు. పిట్టలన్నీ ఉన్నాయి పోట్లాడుకోవటం లేదు.

పడవలో ఏరుదాటి ఇంటికొస్తే ఎంత హాయిగా ఉందో!

అందుకే అమ్మ ఎక్కడికి ఎవరు రమ్మన్నా వెళ్ళదు. మనసుకీ, శరీరానికీ ప్రశాంతంగా ఉండటమంటే ఇదేనేమో!

దానిమ్మ చెట్టు కొమ్మకి పంజరాన్ని తగిలించి ఇంట్లోకి వెళ్ళాడు.

"ఎలా ఉంది సర్కస్సు?" అడిగింది వైదేహి.

"ఏం చెప్పాలో తెలియక తలూపాడు చంద్ర.

మావయ్య ఏదో మాట్లాడుతున్నాడు. మావయ్య కొన్న ఆట వస్తువులు తల్లికి చూపించి బయటకు తుర్రుమన్నాడు చంద్ర.

ఏటిలో స్నానం చేసొచ్చేసరికి మావయ్య వెళ్ళిపోయాడు. బట్టలు మార్చుకుంటుంటే తల్లి అడిగింది.

"నువ్వేదో కొన్నావటగా.... ఎందుకూ?"

బిత్తరపోయి తల్లి ముఖంలోకి చూశాడు చంద్ర.

"కొంటే కొన్నావులే. నీ కిష్టమైంది, అంతేనా?"

సంతోషంతో తలెగరేసి "రా! చూపిస్తా" అంటూ తీసుకు వెళ్ళాడు.

పంజరాన్ని కిందికి దింపి, వాటి ముందు పళ్ళెంలో పళ్ళ ముక్కలు, బియ్యపు గింజలూ, పప్పు ధాన్యాలూ, చిన్న గిన్నెతో నీళ్ళూ పెట్టాడు.

"పాపం.... మరీ చంటివిరా చంద్రా!" అంది వైదేహి.

"అవును.... అందుకే ఎంచి మరీ తెచ్చేను."

"ఏం చేస్తావ్ మరి?" అడిగింది.

"చూస్తూండు...." అంటూ పంజరం తలుపు తెరిచేశాడు. ఒక్క క్షణం కదలలేదా పిట్టలు. తర్వాత ఒక్కొక్కటీ బయటి కొచ్చాయి. రెండు పిట్టలు దానిమ్మ చెట్టు మీదకి ఎగిరిపోయాయి. చిలుక జామచెట్టు కొమ్మమీది కెగిరింది. కొన్ని మరీ చిన్న పిట్టలు పళ్ళెంలోని గింజ లేరుకు తింటున్నాయి. పావురం పిల్ల మాత్రం చంద్రను చూసి చుట్టూ చేరిన పెంపుడు పావురాల గుంపులో కలిసి పోయింది.

కొడుకు ముఖంలోకి ప్రశ్నార్థకంగా చూసింది వైదేహి.

"స్వేచ్ఛగా ఎగిరే పిట్టల్ని బంధించకూడదని నువ్వే అన్నావుగా! అందుకే వీటిని కొన్నా- వాడు వీటికి తిండి కూడా పెట్టటం లేనట్లుంది. ఇప్పుడు చూడు. వాటి కెంత స్వేచ్ఛో!" అన్నాడు అపూర్వ చంద్ర.

వైదేహి ముఖంలో చెప్పలేనంత ఆనందం!

"నా చంద్రుడు.... నా మనోభావాల అపురూప చంద్రుడు" అనుకుంటూ- కొడుకుని దగ్గరకు తీసుకుంది.

ఆ రాత్రి వెన్నెల జలతారుదారాల్లా భూమ్మీది కొస్తున్న వేళ వైదేహి కొడుకుతో అంది.

"నువ్వు మీ నాన్నగారి గురించి అడిగావుగా చంద్రా! నే చెప్పలేదని కోపం కూడా వచ్చింది నీకు, ఇప్పుడు చెప్తున్నా విను. నువ్వు వదిలిపెట్టిన పిట్టలాంటిదాన్ని నేనయితే, నీకు పిట్టల్ని అమ్మిన ఆసామీలాంటివారు మీ నాన్నగారు. ఈ పిట్టకూ, ఆయనకూ మధ్య ఎంత దూరమో ఆలోచించు."

తల్లి ముఖంలోకి చూశాడు అపూర్వ చంద్ర. ఆమె ముఖం గంభీరంగా వెలిగిపోతోంది.

'అర్థమయ్యీ కానట్టు ఎలా చెప్పిందో అమ్మ!'

ఆలోచిస్తూ ఎప్పుడు పడుకున్నాడో!

తెల్లవారి వెలుగు రేకలు విచ్చుకున్నాక, క్రితం రోజు కొన్న పిట్టలు గుర్తొచ్చి చూస్తే....

పంజరంలోంచి బయటికొచ్చిన పిట్టలన్నీ పారిజాతం చెట్టు కింద ఆడుకుంటూ కనిపించాయి!

అపూర్వ చంద్ర వదనం పున్నమి చంద్రుణ్ణి మించి వెలిగింది!

*